సాక్షి
విశాఖపట్నం

సోమవారం । 23 । డిసెంబర్ । 2024



జగదాంబ వద్ద ట్రినిటీ లూథరన్ చర్చిలో ఆదివారం రాత్రి జరిగిన క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్న మహిళలు



తీరంలో కార్నివాల్ సందడి

విశ్వప్రియ ఫంక్షన్ హాలు వేదికగా ఆదివారం కార్నివాల్ జరిగింది. ఇక్కడ భారీ క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. నగర యువత పెద్ద ఎత్తున పాల్గొని.. కార్నివాల్‌ను ఆస్వాదించింది.


- ఏయూక్యాంపస్

ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

తొలి తెలుగు బైబిల్ @ విశాఖ

క్రైస్తవ మత విశ్వాసాలకు బైబిల్ గ్రంథం మూలాధారం. పరిశుద్ధ గ్రంథమని పిలిచే బైబిల్ అనే పదానికి గ్రీకు భాషలో 'వైదిక గ్రంథాల సంహిత' అని అర్థం. ఈ గ్రంథంలో శాంతి, సమాధానం, ప్రేమతత్వం, త్యాగం, దయ, కరుణ, వంటి విషయాలు ఉపమానాలు, కథలు, సంఘటనలతో పెనవేసుకున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే మానవుడి సంపూర్ణ అభ్యుదయం కోసమే బైబిల్ గ్రంథం లిఖించారని క్రైస్తవుల విశ్వాసం. దాదాపు అన్ని భాషల్లోకి అనువదించిన ఈ గ్రంథం తెలుగులో తొలిసారి అనువాదం విశాఖలోనే జరిగింది. ఇందుకు వన్‌టౌన్‌లోని లండన్ మిషన్ మెమోరియల్ చర్చి వేదిక కావడం విశేషం. ప్రస్తుతం ఉన్న సీబీఎం హైస్కూల్ ప్రాంగణంలో (అప్పుడు మిషన్ గార్డెన్/బంగ్లా) కొంత భాగం, లండన్ మిషన్ మెమోరియల్ చర్చిలో ఎక్కువ భాగాన్ని గ్రీకు నుంచి తెలుగులోకి బైబిల్‌ను అనువదించారు. ప్రస్తుతం తొలి తెలుగు బైబిల్ బెంగళూరులో భద్రంగా ఉంది.

– సాక్షి, విశాఖపట్నం



తొలి తెలుగు అనువాద బైబిల్ మొదటి భాగం / తొలి తెలుగు అనువాద బైబిల్ అంత్యభాగం

- లండన్ మిషన్ మెమోరియల్ చర్చి వేదికగా...
- గ్రీకు భాష నుంచి తెలుగులోకి అనువాదం
- 1818లో మద్రాస్‌లో రెండు భాగాలుగా ముద్రణ
- తొలి తెలుగు ప్రార్థన కూడా వైజాగ్‌లోనే..

కోల్‌కతా, వైజాగ్‌లో ఏకకాలంలో..

18వ శతాబ్దంలో డానిష్ లూథరన్ మిషనరీకి చెందిన రెవరెండ్ బెంజిమన్ బైబిల్‌ను తొలిసారిగా తెలుగులో అనువదించారు. అయితే అప్పట్లో భారతదేశంలో ముద్రణా యంత్రాలు లేకపోవడంతో దానిని జర్మనీకి ముద్రణ కోసం పంపించారు. కానీ అది ముద్రణకు నోచుకోకపోవడంతో ఆయన అనువాద గ్రంథం కనుమరుగైంది. ఆ తర్వాత దేశంలో రెండు ప్రాంతాల్లో ఒకే సమయంలో బైబిల్ గ్రంథానువాదానికి శ్రీకారం చుట్టారు. బాప్టిస్ట్ మిషనరీ సొసైటీ ఆధ్వర్యంలో సెరంపూర్(కోల్‌కతా)లో రెవరెండ్ విలియం కేరీ అనువాదం ప్రారంభించారు. అదే సమయంలో లండన్ మిషనరీ సొసైటీ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో రెవరెండ్ అగస్టస్ డి.గ్రాంజెస్, రెవరెండ్ జార్జ్ క్రాన్ తెలుగు అనువాదం ప్రారంభించారు. వీరు ఆనందరాయ అనే తెలుగు వ్యక్తి సహకారం తీసుకున్నారు. అయితే గ్రంథం అనువాదం జరుగుతున్న సమయంలో గ్రాంజెస్, క్రాన్ మరణించారు. అనంతరం అనువాద బాధ్యతను ఎడ్వర్డ్ ప్రిచ్చెట్ తీసుకుని పూర్తి చేశారు. ఈ విధంగా ఒకేసారి కోల్‌కతా, విశాఖలో బైబిల్ తెలుగు అనువాద గ్రంథాల రచన పూర్తయింది.



లెదర్ బైండింగ్‌తో ఉన్న తొలి తెలుగు బైబిల్

విశాఖ గ్రంథాన్నే ఎంపిక చేసిన బృందం

లండన్‌కు చెందిన బ్రిటిష్ అండ్ ఫారిన్ బైబిల్ సొసైటీ అనువాద గ్రంథాలను ముద్రించేందుకు సహకారం అందించేది. తెలుగులో అనువదించిన రెండు గ్రంథాలను బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా(కలకత్తా ఆక్సిలరీ) ఆధ్వర్యంలో తెలుగు స్కాలర్స్ పరిశీలించారు. మను స్క్రిప్ట్ వెర్షన్‌లో అనువదించిన విశాఖ బైబిల్ గ్రంథాన్నే సొసైటీ ఎంపిక చేసింది. మద్రాస్‌లో 1818లో తొలి తెలుగు బైబిల్ గ్రంథాన్ని ఆది భాగం, అంత్యభాగం పేరుతో రెండు భాగాలుగా 2000 కాపీలు ముద్రించారు. అలాగే తొలి తెలుగు ప్రార్థనలు కూడా వన్‌టౌన్‌లోని లండన్ మిషన్ మెమోరియల్ చర్చిలోనే జరిగాయి.



బెంగళూరులో భద్రంగా తొలి ముద్రణ

1818లో ముద్రించిన తొలి తెలుగు బైబిల్‌ను రెండు శతాబ్దాల తర్వాత లండన్ మిషనరీ మెమోరియల్ చర్చికి తిరిగి తీసుకొచ్చారు. 2005లో చర్చి ద్విశతాబ్ది ఉత్సవాలకు లండన్ నుంచి డిక్కర్ వచ్చారు. నెదర్లాండ్స్‌లో భద్రపరిచిన తెలుగు బైబిల్‌ను తీసుకొచ్చి చర్చికి బహుమతిగా ఇచ్చారు. ఆ పుస్తకం లెదర్ బైండింగ్‌తో ఉన్నప్పటికీ చాలా పాతది కావడంతో పేజీలు చాలా పెళుసుగా తయారయ్యాయి. పేజీ తిప్పితే పాడైపోయే స్థితిలో ఉన్న ఈ ప్రతిని సంరక్షించేందుకు బెంగళూరులోని యునైటెడ్ థియోలాజికల్ కళాశాలకు పంపారు.

ఇప్పటికీ ఈ బైబిలే ప్రామాణికం..



ప్రపంచంలో చాలా భాషల్లో ముద్రించిన బైబిల్ గ్రంథం తెలుగు అనువాదానికి విశాఖపట్నం వేదికగా నిలవడం గర్వకారణం. ఇటీవల చేసిన పరిశోధనల్లో తొలి గ్రంథం విశాఖలోనే అనువదించిన విషయం స్పష్టమైంది. 1818 బైబిల్ కొన్ని మార్పులకు గురైనా.. ఇప్పటికీ విశాఖలో అనువదించిన బైబిల్‌నే ప్రామాణికంగా తీసుకుంటున్నారు.

– ఎడ్వర్డ్ పాల్, చరిత్ర అధ్యయనకారుడు

చరిత్ర ఘనం.. వేడుక అంబరం




క్రిస్మస్‌కు ముస్తాబవుతున్న చర్చిలు

డాబాగార్డెన్స్: క్రిస్మస్ వేడుకలకు నగరంలోని పురాతన చర్చిలు సిద్ధమవుతున్నాయి. విశాఖకు ఆయువుపట్టు వంటి పాతనగరంలో 200 ఏళ్ల నాటి చర్చిలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. మరికొన్ని చర్చిలు వందేళ్లు పూర్తి చేసుకున్నాయి. క్రిస్మస్ పురస్కరించుకుని లండన్ మిషన్ మెమోరియల్(సీఎస్ఐ) చర్చి, సెయింట్ ఆంథోనీ చర్చి, సెయింట్ అలోసిస్, సెయింట్ జాన్స్, సెయింట్ ప్యాలీస్, సెయింట్ పీటర్స్, ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి, క్రైస్ట్ చర్చిలను ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు.

లండన్ మిషన్ చర్చి @ 219

1805లో విశాఖపట్నం వచ్చిన లండన్ మిషన్ సొసైటీ(ఎల్‌ఎంఎస్) మిషనరీలు.. మిషన్ హౌస్‌ను తమ స్థావరంగా చేసుకున్నాయి. అందులో 1809 ఫిబ్రవరి 12న తెలుగులో మొదటి ఆదివారపు ప్రార్థన జరిగింది. ఈ విధంగా ఆరాధనలు కొనసాగుతుండగా 25 ఏళ్ల తర్వాత రెవరెండ్ జె.డబ్ల్యూ.గార్డన్ రెండు ప్రార్థనా మందిరాల నిర్మాణానికి పూనుకున్నారు. వాటిలో ఒకటి వన్‌టౌన్‌లోని ప్రస్తుత ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి కాగా.. రెండవది మెయిన్‌రోడ్డులోని ఎల్‌ఎంఎస్ ఆలయం. తర్వాత పరిణామాలతో ఎల్‌ఎంఎస్ చర్చిని చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ) ఆలయంగా కొనసాగిస్తూ, నిర్వహణ బాధ్యతలను అప్పటి స్థానిక సంఘానికి అప్పగించారు. దక్షిణ భారతదేశంలోని ఎల్‌ఎంఎస్ సంఘాలు సౌత్ ఇండియా యునైటెడ్ చర్చిగా(ఎస్ఐయూసీ) రూపాంతరం చెందినప్పుడు ఈ సంఘం కూడా ఎస్ఐయూసీలో విలీనమైంది. ఈ చర్చిలో ఆంధ్ర క్రైస్తవ కీర్తనల రచయిత రెవరెండ్ పులిపాక జగన్నాథం 37 ఏళ్ల పాటు గురువుగా సేవలందించారు. కవి సామ్రాట్ పురుషోత్తమ చౌదరి ఎల్‌ఎంఎస్ సంఘాలతో అనుబంధం కలిగి పరిచర్య చేశారు. ప్రస్తుతం ఈ చర్చికి విన్సెంట్ రాజ్‌కుమార్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

క్రైస్ట్ చర్చి @ 76



చెంగలరావుపేటలో క్రైస్ట్ బాప్టిస్ట్ చర్చిని 1948లో ప్రారంభించారు. చెంగలరావుపేటలోని హోప్‌హాల్ హయ్యర్ ఎలిమెంటరీ స్కూల్‌లో ప్రారంభంలో హోప్‌హాల్ చర్చి స్థాపించారు. చెముడు మహారాణి 600 గజాల స్థలాన్ని అందజేయడంతో 1957లో నూతన చర్చిని నిర్మించారు. అనంతరం హోప్‌హాల్ బాప్టిస్ట్ చర్చిని క్రైస్ట్ చర్చిగా నామకరణం చేశారు. అప్పటి నుంచి అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ 2023 జనవరి ఒకటికి 75 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు.

సెయింట్ ఆంథోనీ @ 107



మహారాణిపేటలోని సెయింట్ ఆంథోనీ చర్చికి 107 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ చర్చిని 1917లో ప్రారంభించారు. 1972లో దీనిని ఆధునీకరించారు. ప్రతి ఆదివారంతో పాటు క్రిస్మస్, గుడ్ ఫ్రైడే రోజుల్లో ఇక్కడ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఏటా జూన్‌లో పునీత ఆంథోనీ జాతర(గుడి పండగ)ను ఘనంగా నిర్వహిస్తారు. క్రిస్మస్ పురస్కరించుకుని చర్చిని ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఫాదర్ బాలసౌరి ఆధ్వర్యంలో ఈ చర్చి కొనసాగుతోంది.



జగజ్జంత్రీ

సీఐడీకే ఝులక్ ఇచ్చిన హయగ్రీవ ఎండీ జగదీశ్వరుడు

- సీజ్ చేసిన ప్రాపర్టీని బ్యాంక్‌లో తనఖా పెట్టిన ఘనుడు
- స్వాధీన హెచ్చరిక బోర్డు ఉన్నా రుణమిచ్చిన యూనియన్ బ్యాంక్
- చీటింగ్, నకిలీ డాక్యుమెంట్ల సృష్టి, ఇలా వివిధ స్టేషన్లు, కోర్టుల్లో 97 కేసులు
- తాజాగా యూనియన్ బ్యాంక్ ఎండీకి అడ్వకేట్ వరుణ్ కుమార్ ఫిర్యాదు

విశాఖ సిటీ: భూములకు నకిలీ సేల్ డీడ్లు సృష్టించాడు.. బ్యాంకులో రుణాలు తీసుకొని మళ్లించాడు. నకిలీ జీఎస్టీ ఇన్ వాయిస్‌లతో ఇన్‌పుట్ క్రెడిట్ క్లెయిమ్ చేశాడు. సంస్థలో నిధులను కాజేసి భాగస్వాములను నట్టేటముంచాడు. రిసార్టులో గ్యాంబ్లింగ్.. చీటింగ్.. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. కోర్టులు, పలు స్టేషన్లలో 97 కేసులు ఉన్న ఘనుడు హయగ్రీవ ఎండీ జగదీశ్వరుడు.. తాజాగా నేర పరిశోధనా సంస్థ(సీఐడీ)కు కూడా ఝులక్ ఇచ్చాడు. సీఐడీ సీజ్ చేసిన భవనాన్ని సైతం బ్యాంక్‌లో తనఖా పెట్టి దర్జాగా రుణం తీసుకున్నాడు. దీనిపై సీఐడీ అదనపు డీజీకి ఫిర్యాదులు అందినప్పటికీ చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తుండడం గమనార్హం. జగదీశ్వరుడిపై 97 కేసులు ఉన్నా.. బ్యాంకు రుణాలు దుర్వినియోగం చేసిన వ్యవహారంలో కేంద్రమే లుక్‌అవుట్ నోటీసు జారీ చేసినా దర్జాగా తిరిగేస్తున్నాడు. తాజాగా బ్యాంక్ రుణాల ద్వారా మనీ లాండరింగ్‌కు పాల్పడుతున్నట్లు అడ్వకేట్ వరుణ్‌కుమార్ నేరుగా యూనియన్ బ్యాంక్ ఎండీకి ఫిర్యాదు చేశాడు.

సీఐడీలో రెండు కేసులు

జగదీశ్వరుడిపై ఇప్పటికే సీఐడీలో రెండు కేసులు నమోదయ్యాయి. భీమిలి మండలం చిప్పాడ గ్రామంలో సర్వే నెంబర్ 160/1లో అర్జర్ల శ్రీనివాసరావు, అతని కుటుంబ సభ్యులకు చెందిన సుమారు 4.61 ఎకరాలకు దొంగ డాక్యుమెంట్లు సృష్టించి హయగ్రీవ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. దీనిపై సదరు యజమానులు ఫిర్యాదు చేయగా సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. అలాగే మరో వ్యవహారంలో కేసు (నంబర్ 3/2013) నమోదు చేయడంతో పాటు ఎంపీవీ కాలనీ సెక్టార్-2లో సర్వే నంబర్ 5/పి, 6/పిలో నిర్మాణంలో ఉన్న 3,126 చదరపు గజాల భవనాన్ని 2015, ఆగస్టు 11వ తేదీన జీవో 124 ప్రకారం స్వాధీనం చేసుకున్నారు.

అడుగుపెట్టిన చోటల్లా మోసమే..

జగదీశ్వరుడు అడుగు పెట్టిన ప్రతీ చోటా ప్రభుత్వ సంస్థలను, భాగస్వాములను, ప్రజలను నిలువునా ముంచుతూనే ఉన్నాడు. అలాగే విలువైన భూములకు నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు, నకిలీ డాక్యుమెంట్లతో ల్యాండ్ పూలింగ్‌లో మోసాలు, సంస్థలో నిధులు కాజేసి భాగస్వాములను మోసం చేయడం ఇలా అనేక కేసులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి.

స్వాధీనం చేసుకున్న నిర్మాణాన్ని బ్యాంకులో తనఖా

సీఐడీ స్వాధీనం చేసుకున్న నిర్మాణాన్ని సైతం జగదీశ్వరుడు బ్యాంకులో తనఖా పెట్టడం విశేషం. 2020 సెప్టెంబర్‌లో యూనియన్ బ్యాంకు నుంచి సుమారు రూ.3.67 కోట్లు దర్జాగా రుణం తీసుకున్నాడు. ఒక వైపు సీఐడీ ఆ భవనానికి స్వాధీన హెచ్చరిక బోర్డును సైతం ఏర్పాటు చేసింది. ఈ స్థలంపై అమ్మకాలు, కొనుగోలు నిషేధించినట్లు అందులో పేర్కొంది. అయినప్పటికీ జగదీశ్వరుడు బ్యాంకుకు మార్ట్‌గేజ్ చేసి రుణం పొందడం విశేషం.

రుణాల ద్వారా మనీ లాండరింగ్

జగదీశ్వరుడు బ్యాంక్ రుణాల ద్వారా మనీ లాండరింగ్‌కు పాల్పడుతున్నట్లు అడ్వకేట్ వరుణ్‌కుమార్ తాజాగా యూనియన్ బ్యాంక్ ఎండీకి ఫిర్యాదు చేశాడు. బ్యాంక్ రుణాలను, గ్యారెంటీలను తీసుకొని.. వాటిని మళ్లించి ప్రజాధనం లూటీ చేస్తున్నాడని పేర్కొన్నాడు. థర్డ్ పార్టీ సెక్యూరిటీస్ ద్వారా నిధుల మళ్లింపునకు పాల్పడుతున్నాడని, రుణాల కోసం తప్పుడు టర్నోవర్‌ను చూపిస్తున్నాడని ఫిర్యాదులో వివరించాడు. బ్యాంక్ గ్యారంటీ, లెటర్ ఆఫ్ క్రెడిట్ ద్వారా ఏకంగా రూ.186.29 కోట్ల మోసానికి పాల్పడినట్లు పేర్కొన్నాడు. సీజ్ చేసిన ఆస్తిని చూపించి రుణాలను పొందాడని, కొత్త బ్యాంక్ అకౌంట్స్ తెరిచి, ఎన్‌పీఏలను చూపి నిధుల మళ్లింపు చేపడుతున్నాడని ఫిర్యాదులో స్పష్టం చేశాడు. ఈ నేపథ్యంలో అతనికి ఓటీఎస్ ఇవ్వాలని చేస్తున్న ప్రయత్నాలు నిలిపివేయాలని.. క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు.

నాట్య మయూరి అపర్ణ



అందం, అభినయంతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేస్తున్న ఈ యువతికి చిన్నప్పటి నుంచి కూచిపూడి నృత్యం అంటే పంచప్రాణాలు. సరిగమల పదనిసలతో అడుగులు కలిపింది. లయబద్ధంగా హావభావాలు ప్రదర్శిస్తూ కూచిపూడి నృత్యానికి వన్నె తెస్తోంది. సాధన చేస్తే సాధించలేనిది లేదంటూ నిరూపించింది. ఆదివారం సౌత్ ఇండియా వుమెన్ అచీవర్స్ అవార్డు-2024 కైవసం చేసుకుంది. మధురవాడ పిలకవానిపాలేనికి చెందిన కూచిపూడి కళాకారిణి ఎస్ఎస్‌వీ అపర్ణ దినదిన ప్రవర్ధమానంగా వెలుగుతూ జాతీయ స్థాయిలో సత్తా చాటుకుంటోంది.

- మధురవాడ

రాష్ట్ర, జాతీయ స్థాయిలో 500కి పైగా ప్రదర్శనలు

కూచిపూడిలో విశేష ప్రతిభ

సౌత్ ఇండియా వుమెన్ అచీవర్స్ అవార్డు-2024 కైవసం

వేదిక ఏదైనా సరే..ఆమె నృత్యానికి పురస్కారాలు, అవార్డులు రావల్సిందే. ఎందరో ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. విశాఖ 104 ఏరియాలోని నేవీ స్కూల్‌లో 11వ తరగతి చదువుతోంది. ఇంతవరకు జిల్లా, రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎన్నో అవార్డులు కైవసం చేసుకుంది. తమిళనాడుకు చెందిన ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ సహాయ సహకారాలతో బెంగళూరులో ఆదివారం కియా (కేఈఏ) ప్రభాత్ ఆడిటోరియంలో ట్విల్ మ్యాగజైన్ సివా (ఎస్ఐడబ్ల్యూఏఏ) 2024 పేరుతో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలలో సౌత్ ఇండియన్ అచీవర్స్ అవార్డు-2024, కూచిపూడి తరంగం మర్కటమణి అవార్డును ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్‌కు చెందిన నేషనల్ వుమెన్స్ సెల్ అధ్యక్షురాలు రాధ కొల్లి చేతుల మీదుగా అందుకుంది. గతంలో మెగా స్టార్ చిరంజీవి, సుమన్ తదితరులు చేతులు మీదుగా ప్రశంసాపత్రాలు అందుకుంది.

కుటుంబ నేపథ్యం

మధురవాడ పిలకవానిపాలేనికి చెందిన శ్రీదేవి, జనార్దనరావు దంపతులకు 2008లో జన్మించిన అపర్ణ తొమ్మిదేళ్ల వయసులోనే కూచిపూడిలో శిక్షణ తీసుకుంది. అంచెలంచెలుగా ఎదిగింది. ఏడేళ్లు పలువురు నాట్య గురువుల వద్ద శిష్యరికం చేసింది. తల్లి ప్రోత్సాహంతో నృత్యంలో విశేషంగా రాణిస్తోంది. కరాటే, స్కేటింగ్, స్విమ్మింగ్ వంటి వాటిల్లో శిక్షణ పొందినప్పటికీ..నృత్యంలో విశేష ప్రతిభ కనబరుస్తోంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఇప్పటి వరకు 500వరకు ప్రదర్శనలు ఇచ్చింది.

అవార్డులే అవార్డులు

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డు, మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఎక్సలెన్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్, సౌత్ ఇండియా ఆర్ట్ అండ్ కల్చర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లలో సైతం తన పేరు నమోదు చేసుకుంది. అలాగే నాట్య కుసుమల ప్రతిభా పురస్కారం, స్వామి వివేకానంద కళా పురస్కారం, గరుడ కీర్తి పురస్కారం, నృత్య ప్రతిభా పురస్కారం, ఉగాది నృత్య ప్రభా పురస్కారం వంటి అనేక అవార్డులు అందుకుంది. వీటితో పాటు శివనంది, నాట్య కిన్నెర, నాట్య సాదక్, కీర్తి కిరణం, నాట్య కౌముది, భారత కళా తిలక్, నాట్య త్రిపుర, ఇందిరా ప్రియదర్శిని, నాట్య మయూరి, నాట్య కళా మయూరి, టాలెంట్ ఐకాన్, నాట్య శిరోమణి, శ్రీనాదంగి, నృత్య విపంచి అవార్డులు అందుకుంది. రామ్ చరణ్ ట్రోఫీ, స్పెషల్ జ్యూరీ అవార్డు, మిలాన్-2023, 2024లలో ప్రతిభ చాటుకుంది. ఎన్టీఆర్, ఏఎన్ఆర్ శత జయంతి ఉత్సవాలలో పద్మశ్రీ చిరంజీవి చేతులు మీదుగా ప్రత్యేక సత్కారం అందుకుంది.



బెంగళూరులో సౌత్ ఇండియా వుమెన్ అచీవర్స్ అవార్డు-2024 అందుకుంటున్న అపర్ణ

జీవీఎంసీకి పీఆర్ఎస్ఐ జాతీయ అవార్డు

- నగర ప్రజల సహకారంతోనే పురస్కారం
- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్ : పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్ఎస్ఐ)-2024 జాతీయ స్థాయి పురస్కారం జీవీఎంసీకి లభించింది. 'ఉత్తమ ప్రజా అవగాహన కార్యక్రమ' కేటగిరీలో ప్రథమ స్థానం దక్కిందని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి 22 వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్‌లో నిర్వహించిన 46వ ఆలిండియా పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్‌లో ఈ నెల 21న ఫార్మర్ ఎంపీ డాక్టర్ నందకుమార్ సాయి, పీఆర్ఎస్ఐ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ అజిత్ పాఠక్, నేషనల్ జనరల్ సెక్రటరీ, స్వచ్ఛ విశాఖ అంబాసిడర్ డాక్టర్ పీఎల్‌కే మూర్తి నుంచి ఈ అవార్డును జీవీఎంసీ తరపున అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, పీఆర్వో ఎస్.నాగేశ్వరరావు అందుకున్నారు. 2023 నుంచి జీవీఎంసీ చేపడుతున్న ఎకో-వైజాగ్, స్వచ్ఛ సర్వేక్షణ్, సీజనల్ వ్యాధుల నియంత్రణ, వ్యర్థాల విభజన, హోమ్ కంపోస్టింగ్, కమ్యూనిటీ గార్డెనింగ్, నీటి పొదుపు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిర్మూలన తదితర అంశాలపై నగర ప్రజలను అవగాహన పరిచినందుకు గాను జీవీఎంసీ ఈ అవార్డు ఎంపికైందన్నారు. విశాఖ నగర ప్రజలు, నగర మేయర్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛ విశాఖ అంబాసిడర్లు, నివాసిత సంక్షేమ సంఘాలు, ఫిల్మ్, స్పోర్ట్స్ సెలబ్రెటీలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, విద్యా సంస్థల సహకారం వల్లే ఈ పురస్కారం లభించిందని తెలిపారు.



అవార్డు అందుకుంటున్న ఏడీసీ రమణమూర్తి

శ్రామికుడా.. నావికుడా...

-ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



సంప్రదాయ మత్స్యవేటతో ప్రారంభమైన ప్రయాణం నేడు ప్రపంచాన్ని చుట్టి వచ్చే వరకు సాగింది. నీటిపై తేలుతూ చిన్న పాటి పడవలో చేపలను పట్టుకునే సంప్రదాయ మత్స్యకారుడి చిత్ర వెనుక భాగంలో సముద్రంలో రక్షణ రంగానికి చెందిన షిప్ కనువిందు చేసింది. ఒకరు పొట్టకూటి కోసం చేపల వేట సాగిస్తుండగా.. మరొకరు దేశ రక్షణ కోసం పనిచేస్తున్నట్టు.. ఆదివారం సాయంత్రం ఆర్.కె బీచ్ సమీపంలో కనిపించిందీ ఈ దృశ్యం. - ఏయూక్యాంపస్



జనంతో నిండిపోయిన ఆర్‌కే బీచ్

సాగరమంత సందడి

ఏయూక్యాంపస్: వరుణుడు విరామమిచ్చి భానుడు తన కిరణాలను ప్రసరించడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. ఆదివారం నగరవాసులు సాగర తీరంలోని పార్కుల్లో కుటుంబ సభ్యులు, స్నేహితులతో సంతోషంగా గడిపారు. తుపాను ప్రభావంతో ఇంటి బయట కాలు పెట్టలేని పరిస్థితులను నగరవాసులు నాలుగైదు రోజులుగా చూస్తున్నారు. వర్షాల ప్రభావంతో ఇబ్బందులు పడ్డ ప్రజలు ఆదివారం సేదతీరారు. వర్షం ఆగిపోడం, వాతావరణం బాగుండటంతో మధ్యాహ్నం నుంచి బీచ్‌కు వచ్చే పర్యాటకులు, నగరవాసుల సంఖ్య పెరిగింది. వీఎంఆర్‌డీఏ పార్క్ చిన్నారులతో కిటకిటలాడింది. ఆట వస్తువులతో ఆడుతూ చిన్నారులు ఎంజాయ్ చేశారు. ఆర్‌కే బీచ్‌కు భారీగా ప్రజలు తరలివచ్చి సందడి చేశారు. కురుసుర, యుద్ధ విమాన మ్యూజియాల వద్ద పర్యాటకులు బారులుదీరారు. దీంతో బీచ్ రోడ్డు జనసమ్మర్దంగా మారింది.

ఉత్సాహంగా 'సాక్షి' స్పెల్ బీ సెమీఫైనల్



శ్రీ విశ్వ స్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



సీతమ్మధార: 'సాక్షి' స్పెల్ బీ రీజినల్ సెమీఫైనల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. సాక్షి మీడియా ఆధ్వర్యంలో బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని శ్రీ విశ్వ స్కూల్‌లో ఆదివారం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ప్రధాన స్పాన్సర్‌గా 'డ్యూక్స్ వాఫీ', అసోసియేట్ స్పాన్సర్‌గా 'ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్, రాజమండ్రి' వ్యవహరించాయి. వివిధ కేటగిరీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాలకు చెందిన 150 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష బాగా రాశామని పలువురు విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. 'సాక్షి' మీడియా అందించిన ప్రిపరేషన్ మెటీరియల్ తమకు ఎంతగానో ఉపయోగపడిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్ కోసం ఏటా ప్రత్యేక చొరవ తీసుకుని పరీక్షలు నిర్వహిస్తున్న 'సాక్షి' మీడియాకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. పిల్లల మేధోశక్తిని పెంచేందుకు సాక్షి చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమాన్ని 'సాక్షి' బ్రాంచ్ మేనేజర్ చంద్రరావు పర్యవేక్షించగా.. శ్రీ విశ్వ విద్యా సంస్థల చైర్మన్ ధర్మరాజు, డైరెక్టర్లు శివాజీ, సూర్యనారాయణ, డీన్ హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

SAKSHI SPELL Bee 2024-25

నమ్మకం కలిగింది



సాక్షి స్పెల్ బీ పరీక్ష కోసం కొద్ది రోజులుగా సన్నద్ధమయ్యాను. పరీక్ష బాగా రాశాను. దీంతో మరింత నమ్మకం కలిగింది. సబ్జెక్టును మెరుగుపరుచుకునేందుకు ఈ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయి.

-ఎం.స్ఫూర్తి శ్రీ, పదో తరగతి, శర్వాణి విద్యాలయం, అరసవిల్లి, శ్రీకాకుళం

అర్థాలు తెలిశాయి



సాక్షి స్పెల్ బీ మాకు ఎంతో ఉపయోగపడింది. ఇంగ్లిష్‌లో లోతైన అర్థాలు తెలిశాయి. స్టేజీపై మాట్లాడేందుకు మా భాషను మెరుగుపరుచుకోవచ్చు. సాక్షికి ధన్యవాదాలు.

- ఎస్.విష్ణు శ్రీప్రియ, ఏడో తరగతి, కేకేఆర్ గౌతమ్ స్కూల్, ఎంవీపీకాలనీ, విశాఖపట్నం,

పరీక్ష బాగా రాశాను



సాక్షి స్పెల్ బీ సెమిఫైనల్ పరీక్ష కోసం మా అమ్మనాన్నతో కలిసి వచ్చాను. పరీక్ష చాలా బాగా రాశాను. స్పెల్ బీ పరీక్షకు సిద్ధమవడం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకున్నాను.

- వి.సాయి సహన, ఐదో తరగతి, శ్రావణి విద్యాలయం, శ్రీకాకుళం

రైల్వే స్టేషన్‌లో తప్పిన ప్రమాదం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ప్రమాదం తప్పింది. స్టేషన్‌కి వచ్చిన ఓ రైలు విద్యుత్ తీగలను ఈడ్చుకెళ్లింది. ఆదివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలివీ.. తిరునెల్వేలి–పురులియా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(22606) ఉదయం 5.20 గంటలకు రైల్వే స్టేషన్‌కి చేరుకుంది. రైలు ఇంజిన్‌ను మార్పు చేస్తున్న క్రమంలో.. తొలగించిన ఇంజిన్ ముందుకెళ్తూ విద్యుత్ తీగలను కొంతదూరం వరకూ ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనను గుర్తించిన రైల్వే సిబ్బంది వెంటనే చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై వాల్తేర్ డివిజన్ అధికారులు మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్‌లో 3, 4 ప్లాట్‌ఫారాలపై ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ మెయింటెనెన్స్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగానే 3వ నంబర్ ప్లాట్‌ఫాంపై తొలగించిన వైరును ఇంజిన్ ఈడ్చుకుని వెళ్లిందని స్పష్టం చేశారు. ఈ కారణంగా కొన్ని రైళ్లు ఆలస్యంగా రాకపోకలు సాగించినట్లు వెల్లడించారు.

కవులు, కళాకారులను ఆదుకోవాలి

సీతమ్మధార: తెలంగాణ తరహాలో రాష్ట్రంలోని కవులు, కళాకారులను ఆదుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు దాటినా.. ఉత్తరాంధ్రలో కవులు, కళాకారులు, రచయితలు వివక్షకు గురవుతున్నారన్నారు. సుబ్బారావు పాణిగ్రాహి నుంచి వంగపండు వరకు కళాకారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కవులు, కళాకారులు, రచయితల బాగోగులను రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆ చోరీకి పాల్పడింది 'తార్ గ్యాంగ్'

- అంతర రాష్ట్ర దొంగల ముఠాలోని సభ్యుడి అరెస్టు
- రూ. 5 లక్షల స్వాధీనం
- పరారీ ప్రధాన నిందితులు



కేసు వివరాలు చెబుతున్న ఏసీపీ వెంకటరావు

పీఎం పాలెం: భారీ చోరీని నగర పోలీసులు ఛేదించారు. చోరీకి పాల్పడింది అంతర రాష్ట్ర దొంగల ముఠాగా గుర్తించారు. సుమారు 5 నెలల పాటు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. నేరవిభాగం ఏసీపీ ఏ. వెంటరావు ఆదివారం సాయంత్రం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొప్పర్తి వెంకటేశ్వరరావు ఆయన భార్య వేంకట సీతా మహాలక్ష్మి సంధ్యాదేవి జీవీఎంసీ 8వ వార్డులోని లా కాలేజీ రోడ్డులో ఉన్న పనోరమా హిల్స్ ఆర్కిడ్స్ 43ఏ లో నివసిస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు 8న పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరానికి వెళ్లి తిరిగి 9న ఫ్లాట్‌కు వచ్చారు. అయితే ఇంటి తాళం పగలగొట్టి ఉండడం.. బీరువాలో భద్రపరిచిన 1,040 (కేజీ 40 గ్రాములు) గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 20 లక్షలు చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సాంకేతికత సాయంతో దర్యాప్తు ముమ్మరం చేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన అంతర్ రాష్ట్ర తార్ గ్యాంగ్ దొంగల ముఠా చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. తార్ గాంగ్ వివరాలను సమగ్రంగా సేకరించారు. మధ్యప్రదేశ్‌లో వారు నివసించే ప్రాంతంపై నిఘా పెట్టారు. అక్కడ పోలీసుల సహకారం తీసుకున్నారు. ఈ ముఠాకు నాయకుడిగా మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లా తర్సింగా గ్రామానికి చెందిన కుందన్‌గా గుర్తించారు. రెండో నిందితుడిగా సురేష్, మూడో నిందితుడిగా రాకేష్‌ను గుర్తించారు. జాతీయ రహదారికి సమీపంలోని లా కాలేజీ ఏరియాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడు సురేష్‌ను శనివారం అదుపులోకి తీసుకుని ఆదివారం అరెస్టు చేశారు. అతని నుంచి రూ. 5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న ముఠా నాయకుడు కుందన్, రాకేష్‌ల కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం గాలిస్తోంది. సమావేశంలో నేరవిభాగం ఏడీసీపీ ఎం.మోహనరావు, ఎస్‌ఐ శ్రీనివాసరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

స్పా సెంటర్‌లో వ్యభిచారం

నిర్వాహకుడితో పాటు విటుల అరెస్ట్

బీచ్‌రోడ్డు: వీఐపీ రోడ్డులోని స్పా సెంటర్‌పై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. నిర్వాహకుడితో పాటు విటులను అరెస్ట్ చేశారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివీ.. వీఐపీ రోడ్డులోని డావిన్సీ థాయ్ స్పాలో వ్యభిచారం జరుగుతుందనే సమాచారంతో ఇన్‌చార్జి సీఐ తిరుమలరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఆ సమయంలో నాలుగు గదుల్లో నలుగురు యువతులు, నలుగురు విటులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.15 వేలు స్వాధీనం చేసుకున్నారు. సెంటర్‌ను నడుపుతున్న ఎస్. వంశీధర్‌తో పాటు విటులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. యువతులను శక్తి సదన్ హోమ్‌లో చేర్పించారు.

ఏడు కేసుల్లో ఆరుగురి దొంగల అరెస్ట్

- రూ.5 లక్షల విలువైన సామగ్రి స్వాధీనం
- క్రైం విభాగం ఏసీపీ లక్ష్మణరావు వెల్లడి



రికవరీ చేసి సామగ్రితో ఏసీపీ లక్ష్మణరావు, చిత్రంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సూరిబాబు

పెందుర్తి: పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడిన ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు వెస్ట్ జోన్ క్రైం విభాగం ఏసీపీ డి.లక్ష్మణరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆదివారం పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఏసీపీ ఆయా వివరాలను వెల్లడించారు.

- గోపాలపట్నం సమీపంలోని కొత్తపాలెంలో ఉంటున్న సుశాంత్ షాహు, నగరంలోని కొబ్బరితోట ప్రాంతానికి చెందిన జగన్నాథం షాహు కలిసి నరవలోని వెల్డింగ్ దుకాణంలో వెల్డింగ్ మెషీన్లు, గోపాలపట్నంలో గ్యాస్ సిలిండర్లు, నరవలో రెండు ఇళ్లలో వెండి వస్తువులు, ఎయిర్‌పోర్టు సమీపంలోని విమానగర్‌లో ఎలక్ట్రికల్ మిషన్లు, వైర్లు దొంగిలించారు.
- విజయనగరం జిల్లా కొత్తవలస ప్రాంతానికి చెందిన రావుల రమణ, నాగలూరి నాగరాజు, మంగళపాలెనికి చెందిన దొడ్ల జగదీశ్వరరావు కలిసి పెందుర్తి మండలం అక్కిరెడ్డిపాలెం ప్రాంతంలో పది కోళ్లను ఎత్తుకుపోయారు.
- పెందుర్తి సమీపంలోని ద్రోణంరాజునగర్‌కు చెందిన కోసూరు రవిశంకర్ కుమార్ సుజాతనగర్‌లోని స్టీల్ జ్యూస్ కౌంటర్‌ను ఎత్తుకెళ్లిపోయాడు. ఆయా కేసుల్లో బాధితుల ఫిర్యాదులు అందుకున్న వెస్ట్ జోన్ విభాగం సీఐ(ఇన్‌చార్జి) శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెందుర్తి ఎస్ఐ డి.సూరిబాబు బృందం దర్యాప్తు ముమ్మరంగా చేసింది. ఈ క్రమంలో దొంగలను పట్టుకుని వారి వద్ద నుంచి సొత్తును రికవరీ చేసినట్లు ఏసీపీ వెల్లడించారు. పెందుర్తి క్రైం విభాగం ఎస్ఐ డి.సూరిబాబు, ఏఎస్ఐ రాజబాబు, హెచ్‌సీలు జి.నాగరాజు, ఎం.ఎస్ నాయుడు, శ్రీరాం, భవానీ, పీసీలు టి.శివప్రసాద్, బి.దేముడునాయుడు, ఎల్.ఎస్ నాయుడు, పైడిరాజులను ఉన్నతాధికారులు అభినందించారు.

మిజోరంతో యూపీ ఢీ నేడే

విశాఖ స్పోర్ట్స్: విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా సోమవారం వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో మిజోరం, ఉత్తరప్రదేశ్ జట్లు తలపడనున్నాయి. గ్రూప్ డీ మ్యాచ్‌లకు విశాఖ ఆతిథ్యం ఇస్తుండగా.. శనివారం జరగాల్సిన తొలిమ్యాచ్(చత్తీస్‌గఢ్ X మిజోరం) వర్షం కారణంగా రద్దయింది. శనివారం మధ్యాహ్నం తర్వాత వర్షం తగ్గడంతో స్టేడియంలో కవర్లు తొలగించేశారు. కాగా.. ఉత్తరప్రదేశ్ జట్టుకు రింకూ సింగ్ నాయకత్వం వహిస్తున్నాడు. రానున్న ఐపీఎల్ సీజన్‌లో కె.కె.ఆర్ కెప్టెన్‌గా రింకూ పేరు పరిశీలనలో ఉండటంతో ఈ టోర్నీలో అతని ప్రదర్శన కీలకం. మిజోరం జట్టు ఇటీవల ప్లేట్ గ్రూప్ నుంచి ఎలైట్ గ్రూప్‌కు చేరింది. ఆ జట్టులోని టాపార్డర్ బ్యాటర్ అగ్నిచోప్రా గత 12 మ్యాచ్‌ల్లో 1804 పరుగులు, మోహిత్ జంగ్రా 693 పరుగులు చేయగా, కమియప్ప లిస్ట్ ఏలో 12 వికెట్లు తీశాడు. జోథన్ సంగా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఉత్తరప్రదేశ్ జట్టులో వికెట్ కీపర్ ఆర్యన్ జుయల్ (1372 పరుగులు), విప్రజ్ నిగమ్ (ఫస్ట్‌క్లాస్‌లో 13 వికెట్లు), భువనేశ్వర్ కుమార్ వంటి ఆటగాళ్లు ఉన్నారు. ఉదయం 9 గంటల నుంచి మ్యాచ్ ప్రారంభమవుతుంది. స్టేడియంలో 15వ గేటు ద్వారా ఉచితంగా ప్రవేశం కల్పిస్తారు.


క్రాస్ కంట్రీ జిల్లా జట్ల ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపికను ఆదివారం పోర్ట్ స్టేడియంలో నిర్వహించారు. జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో మెన్, వుమెన్, అండర్ 20,18,16 బాల బాలికల విభాగాల్లో పోటీలు జరిగాయి. జనవరి 5న రాష్ట్ర స్థాయి పోటీలు పశ్చిమగోదావరి జిల్లా తణుకులో జరగనున్నాయని సంఘం కార్యదర్శి నారాయణరావు తెలిపారు. పోటీల్లో విజేతలకు విశ్వనాధ స్పోర్ట్స్ క్లబ్ అధినేత మెడల్స్ అందించారు. కోచ్‌లు రాంకుమార్, వైకుంఠరావు సహకారం అందించారు. మెన్‌లో వేదవ్యాస్, రమేష్, శ్యామ్ వుమెన్‌లో దివ్యదుర్గ, జ్యోతిదుర్గ, హేమంగిణి తొలి మూడు స్థానాల్లో నిలిచారు. అండర్ 20 బాలురలో చిన్న, సాయి యశ్వంత్, రాజవర్ధన్, బాలికల్లో హాసిని, వైశాఖి, రోహిణి, అండర్–18 బాలురలో జగదీష్, సాయివిగ్నేష్, సూర్యతేజ, బాలికల్లో ప్రవేశిక, భార్గవి, గాయత్రి లాస్య తొలి మూడు స్థానాల్లో నిలిచారు. అండర్–16 బాలురలో జీవన్‌కుమార్, జశ్విన్, అన్వేష్ బాలికల్లో రాగిణి, కావ్యమూర్తి, లక్ష్మీఅనూష తొలి మూడు స్థానాల్లో నిలిచారు.

గిరిజన సంఘం ఎన్నికల్లో అప్పలరాజు ప్యానల్ విజయం

ఎంవీపీకాలనీ: అఖిల భారత గిరిజన సంక్షేమ సంఘం విశాఖ జిల్లా ఎన్నికల్లో ఎస్.అప్పలరాజు అధ్యక్షుడిగా పోటీ చేసిన ప్యానల్–2 విజయం సాధించింది. ఎంవీపీ కాలనీలోని గిరిజన భవన్‌లో ఆదివారం ఈ ఎన్నికలు నిర్వహించారు. సంఘంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న 2,234 మంది ఉద్యోగులు ఓటర్లుగా ఉండగా.. ఈ ఎన్నికల్లో 1,469 మంది సభ్యులు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్యానల్–1 నుంచి డిప్పల సాంబమూర్తి, ప్యానల్–2 నుంచి అప్పలరాజు అధ్యక్షుడిగా పోటీలో నిలిచారు. 81 ఓట్ల తేడాతో ప్యానల్–2 విజయం సాధించింది.

మైమరపించిన నృత్యరూపకం



మోహినీ భస్మాసుర నృత్యరూపకంలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కళాభారతి ఆడిటోరియంలో నృత్యోత్సవాలు కొనసాగుతున్నాయి. మూడో రోజు ఆదివారం ప్రదర్శించిన మోహినీ భస్మాసుర నృత్యరూపం ప్రేక్షకుల ను మైమరపించింది. కళాభారతి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాంబాబు, కనక మహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు, నాట్యాచార్యుడు హరి రామ్మూర్తి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నృత్యరూపకంలో శ్రీ మహావిష్ణువు దుష్టశక్తులను, రాక్షసులను సంహరించడానికి అనేక అవతారాలు ఎత్తిన వైనాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. నృత్యరూపకంలో గురు శ్రీ హరి రామమూర్తిని భస్మాసురుడుగా, సన్నిధ మోహినిగా, సుబ్బరాజు (చెన్నై) పరమేశ్వరుడిగా అద్భుతంగా నృత్యం చేసి అందరి హృదయాలను రంజింపజేశారు. అనంతరం గురు శ్రీ హరి రామమూర్తిని ఘనంగా సత్కరించారు.

మత్స్య పరిశ్రమ దివిటీ సీఐఎఫ్‌టీ

- సాంకేతికత, ప్రాసెసింగ్ రంగంలో నిరంతర పరిశోధనలు
- మత్స్య సంపదకు విలువను జోడించే ఉత్పత్తుల రూపకల్పన



బీచ్‌రోడ్డులోని సీఐఎఫ్‌టీ కేంద్రం



అధునాతన ప్రయోగశాల

ఏయూక్యాంపస్: తూర్పు తీర ప్రాంతంలోని మత్స్యకారులు, మత్స్య పరిశ్రమకు సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (సీఐఎఫ్‌టీ) చుక్కానిగా వ్యవహరిస్తోంది. ఇది మత్స్య సంపదను అభివృద్ధి చేయడం, వాటికి విలువ జోడించడం, మత్స్య రంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడం వంటి లక్ష్యాలతో పరిశోధనలు చేస్తోంది.

బీచ్‌రోడ్డులోని పాండురంగాపురంలో కేంద్ర ప్రభుత్వం 1962లో సీఐఎఫ్‌టీ స్థాపించింది. ప్రధానంగా ఈ కేంద్రం రెండు విధులను నిర్వహిస్తోంది. మత్స్య వనరుల నిర్వహణ, నియమావళి ప్రకారం సముద్ర మత్స్య వ్యవస్థలను అభివృద్ధి చేయడం, ట్రాల్ నెట్లు, వివిధ రకాల చేపలను పట్టే వలలపై పరిశోధనలు చేసి, వాటి తయారీకి సంబంధించిన అంశాలను అధ్యయనం చేస్తోంది. అంతేకాకుండా నదీ జలాల్లో నూతన పద్ధతులను అనుసరించి మత్స్య సంపదను పెంచే విధానాల అభివృద్ధికి కృషి చేస్తోంది. అలాగే తూర్పు తీరంలో లభించే వివిధ రకాల చేపల పోషక విలువలను గణించి, మత్స్య ఉత్పత్తులకు విలువను జోడించే పద్ధతులను అభివృద్ధి చేస్తోంది. ఎండబెట్టిన సముద్ర ఉత్పత్తులకు అనువైన సాంకేతికతలను అభివృద్ధి చేయడంతో పాటు, సముద్ర మొక్కలను ఉపయోగించి ప్యాకేజింగ్ ఉత్పత్తులను తయారు చేసే అవకాశాలను అన్వేషిస్తోంది. చేపల నాణ్యత, మైక్రోబయోలాజికల్ నాణ్యతను అంచనా వేయడం, సహజ సిద్ధమైన యాంటీమైక్రోబయల్ ఉపయోగించి హానికరమైన బ్యాక్టీరియాను నియంత్రించడం ద్వారా మత్స్య ఉత్పత్తుల భద్రతను పెంచడానికి కృషి చేస్తోంది. యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్)పై పరిశోధనలు చేస్తోంది.

సాధించిన విజయాలు

- సుస్థిరమైన, బాధ్యతాయుతమైన చేపల వేట విధానాల అమలుకు సీఐఎఫ్‌టీ కృషి చేస్తోంది. ఇందుకోసం అవసరమైన వలలను రూపొందించింది. చిన్న చేపలు సులభంగా వలల నుంచి బయటకు వచ్చే విధంగా వల చివరి భాగంలో ఉండే మడిని ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించింది. చేపల జాతులు అంతరించిపోకుండా పరిరక్షిస్తోంది.
- చెరువులు, నదుల్లో చేపలు పట్టడానికి అనువుగా, సులభంగా ఎక్కడికైనా తీసుకువెళ్లగలిగే నూతన వలలను శాస్త్రవేత్తలు రూపొందించి అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రత్యేకంగా దీర్ఘచతురస్రాకారపు కాడ్ ఎండ్ వలలను తయారు చేశారు.
- సముద్రంలో 200 అడుగుల నుంచి 1100 అడుగుల లోతు వరకు ఉన్న 155 జాతుల చేపలను గుర్తించారు.
- ఎగుమతుల్లో అత్యంత ప్రాముఖ్యత కలిగిన ట్యూనా చేపలు లభించే సమయాలు, పరిస్థితులను శాటిలైట్ సాంకేతికతను ఉపయోగించి అంచనా వేసే ప్రత్యేక వ్యవస్థను అభివృద్ధి చేశారు.
- చేపలు, రొయ్యల నాణ్యత, పోషక విలువలను గుర్తించడంపై అధ్యయనాలు నిర్వహించారు.
- చేపలను ఉపయోగించి పచ్చళ్లు, కట్లెట్లు, ఫింగర్ బాల్స్, నూడుల్స్, సాసేజ్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేస్తున్నారు.
- సముద్ర మత్స్య సంబంధిత ఉత్పత్తులను సులభంగా ఎండబెట్టడానికి అనువైన ఆధునిక సాంకేతిక విధానాలను అభివృద్ధి చేశారు.
- పోషక విలువలు కలిగిన సముద్ర నాచు, మొక్కలను ఉపయోగించి పాడులు, నూడుల్స్, బిస్కట్లు వంటి ఆహార ఉత్పత్తుల తయారీ సాంకేతికతను అభివృద్ధి చేశారు.
- చేపల్లో రసాయనిక, జీవ సంబంధమైన వ్యాధులు, ప్రభావాలను అధ్యయనం చేస్తున్నారు.
- మత్స్య సంపదను సులభంగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించడానికి అనువైన తేలికగా ఉండే బ్యాగ్‌ను తయారు చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు.

మత్స్య సంపదను సంరక్షిస్తూ, వృద్ధి సాధించాలి



సముద్రంలో లభించే మత్స్య సంపదను ఒక క్రమపద్ధతిలో మాత్రమే వేటాడాలి. తద్వారా సంపదను సంరక్షించడం సాధ్యపడుతుంది. అదే సమయంలో మత్స్య సంపదను గుర్తించి పట్టుకోవడం, ఆర్థికంగా లాభపడటం ఎంతో అవసరం. ఈ దిశగా సీఐఎఫ్‌టీ పనిచేస్తోంది. ప్రస్తుత అవసరాలకు తగినట్టుగా పరిశోధనలు చేస్తూ.. మత్స్య అనుబంధ రంగాల అభివృద్ధికి కృషి చేస్తోంది.

-డాక్టర్ యు.శ్రీధర్, సైంటిస్ట్ ఇన్‌చార్జి, సీఐఎఫ్‌టీ

విలువను జోడించాలి



సముద్రంలో లభిస్తున్న మత్స్య సంపదను నేరుగా విక్రయించడం వల్ల ఆదాయం తక్కువగా లభిస్తోంది. ఆదాయం పెంచే విధంగా విలువను జోడించే ఉత్పత్తుల తయారీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటికే పలు ఉత్పత్తులను తయారు చేసి అందుబాటులోకి తీసుకొచ్చాం. స్టార్టప్, పరిశ్రమలు స్థాపించాలనే ఆకాంక్ష కలిగిన వారికి అ సహకారం అందిస్తున్నాం.

– బి.మధుసూదన రావు, ప్రిన్సిపల్ సైంటిస్ట్